వైభవంగా క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

- భక్తులతో పోటెత్తిన చర్చి ప్రాంగణాలు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రత్యేక ప్రార్థనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): లోక రక్షకుడు జన్మ దిన వేడుకలను పురస్కరించుకొని నగర వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచే క్రిస్మస్ శోభ సంతరించుకుంది. క్రిస్మస్ వేడుకల సందర్భంగా నగరంలోని అన్ని క్రైస్తవ మందిరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి ఆయా చర్చి ఆవరణల్లో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి జరిగే ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరై ఏసుక్రీస్తును ధ్యానించారు. మరోవైపు క్రిస్మస్ వేడుకల సందర్భంగా మిఠాయి దుకాణాలు, బేకరీలు కళకళలాడాయి. అలాగే గ్రీటింగ్ కార్డ్స్‌కు డిమాండ్ పెరిగింది. క్రిస్మస్ శుభాకాంక్షలు కులమతాలకు అతీతంగా ఇచ్చిపుచ్చుకున్నారు. ప్రధానంగా పలు మిఠాయి దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా బీఆర్పీ రోడ్డు, నెహ్రూ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న చర్చి పరిసరాలలో పలు దుకాణాలు వెలిశాయి. సాయంత్రం ఏడు గంటల నుంచి ఆయా ప్రాంతాలన్నీ కళకళలాడాయి. వన్‌టౌన్‌లోని మార్కెట్లన్నీ వినియోగదారులతో సందడిగా దర్శనమిచ్చాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకొని నూతన వస్త్రాలు కొనుగోలు చేసేవారు. మిత్రులకు, పెద్దలకు బహుమతులను అందజేసేవారు, తారాపేట పరిసర ప్రాంతాల్లో చిరుదుకాణాలు భారీగా వెలిశాయి.

ముస్తాబైన చర్చి ప్రాంగణాలు

పాతబస్తీలోని పురాతన చర్చి ప్రాంగణాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ప్రధానంగా సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి(ఆర్సీఎం) ప్రాంగణంలోని మేరీమాత, ఏసుక్రీస్తు విగ్రహాల వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలను నిర్వహించారు. అలాగే చర్చి ప్రాంగణమంతా విద్యుత్ దీపాలను అలంకరించారు. అలాగే చర్చి లోపల ప్రాంగణాన్ని బిషప్ రాక కోసం ముస్తాబు చేశారు. అలాగే క్రీస్తు జననాన్ని వివరించే నమూనాలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. దాంతో పాటుగా బాబూ రాజేంద్రప్రసాద్ రోడ్డులోని మరో పురాతన చర్చి సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి ఆవరణను సైతం చక్కగా ముస్తాబు చేశారు. దీంతో పాటుగా చర్చి ఆవరణ మొత్తం ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ప్రాంగణంలో క్రీస్తు జననం బొమ్మల కొలువు అలరించింది. అలాగే రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాడివీధిలోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి, బీఆర్పీ రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ సెంటినరీ చర్చి తదితర ప్రాంగణాలు సైతం విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. ఆయా ప్రాంగణాల్లో ప్రత్యేక కార్యక్రమాలను మంగళవారం రాత్రి నుంచే ప్రారంభించి, అర్ధరాత్రి వరకు కొనసాగాయి.



ఆర్సీఎం చర్చిలో పశువుల పాక



విద్యుత్ వెలుగులో ఆర్సీఎం చర్చి



కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు

క్రిస్మస్ వేడుకల్లో పెద్ద, పెద్ద కటౌట్లతో స్వాగత బ్యానర్లు, క్రీస్తు జన్మవృత్తాంతం తెలిజేసే పశువుల పాకలను ఏర్పాటు చేసి వాటిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ నెల 24 నుంచి జనవరి 7 వరకు జరిగే ఈ వేడుకలను ఆర్సీఎం ఫాదర్ దామాల విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం బాల ఏసు ప్రతిమకు పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టైలర్‌పేటలోని బాల ఏసు యూత్, వించిపేటలోని పలు చర్చిల్లో వేడుకలను ఆయన ప్రారంభించారు.



వేలంగిణి మాత సేవా సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న ఆర్సీఎం ఫాదర్ విజయ్‌కుమార్

చిట్టినగర్‌లో క్రిస్మస్ వేడుకలు..

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలోని వించిపేట, చిట్టినగర్, టైలర్‌పేట, ఫ్రైజర్‌పేట ప్రాంతాలలో వైభవంగా క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చిట్టినగర్‌లోని వేళాంగిణి మాత యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన

నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



భాగ్యలక్ష్మి, మేయర్ ధ్యానచంద్ర, కమిషనర్

పటమట (విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రిస్మస్ అందరికీ ఆనందాన్ని ఇవ్వాలని, ప్రజల హృదయంలోని ప్రతి కల నెరవేరాలని కోరుకుంటూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

28, 29 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ విడుదల చేయక పోవడం వలన విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, చదువు మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి లోకేష్‌బాబు గుడ్ న్యూస్ పేరుతో ట్వీట్లు పెట్టడం తప్పా.. ఒక్క రూపాయి కూడా విద్యార్థులకు ఇవ్వలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించి నూతన భవనాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేసి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, మాధవ్, నగర నాయకులు ఓజేశ్వేన్, వాసు, కుశల్ కుమార్, ఇనోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై అందరూ ఉద్యమించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి సర్కార్ ప్రజలపై వేసిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అందరూ సమష్టిగా ఉద్యమించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీన తమ పార్టీ చేపట్టిన పోరుబాటలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పార్టీ రూపొందించిన విద్యుత్ బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను వెలంపల్లి శ్రీనివాసరావు తన కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి సర్కార్ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను తుంగలోకి తొక్కి అడ్డగోలుగా ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాలు అల్లాడుతున్నాయని వివరించారు.

ఏపీలో విద్యుత్ చార్జీల బాదుడుపై తమ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు డిసెంబరు 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పేరుతో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30 గంటలకు పశ్చిమలో ఊర్మిళానగర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి రామరాజ్య నగర్ సబ్‌స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. కార్పొరేటర్లు మండెపూడి ఛటర్జీ, యరడ్ల ఆంజనేయరెడ్డి, షేక్ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, నాయకులు రాయన నరేంద్ర, షేక్ హయత్, సరగడ శంకర్ రెడ్డి, బంక చాము పాల్గొన్నారు.

కళాక్షేత్రంలో అక్కినేని విగ్రహావిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ గ్రహీత, పద్మవిభూషణ్ నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో జరిగింది. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్సరే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. మన జిల్లావాసి అక్కినేనికి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ ఉమ్మడి చంటి మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం పొంది సుమారు 253 చిత్రాలలో నటించి మెప్పించిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వసంత్ కుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, ఎక్సరే కార్యదర్శి బి.ఆంజనేయరాజు, బందారు వెంకటేశ్వరరావు, కోరంగి నాగ మల్లేశ్వరి, ఎన్‌బీజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విద్యార్థులతో న్యాయవాది సాయి రాజు, నిర్వాహకురాలు సునీత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ రోటరాక్ట్ క్లబ్, హాబీస్ క్లబ్, ఎస్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కె.రాఘవయ్యలు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, డాక్టర్ కె.సురేష్, అధ్యాపకులు రమాదేవి, బి.శ్రీకాంత్‌రెడ్డి, పి.సురేష్, నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులతో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుద్ధి మాంద్యం కలిగిన మానసిక దివ్యాంగుల కోసం విద్యాధరపురంలో నెలకొల్పిన భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్ట్ న్యాయవాది జంగం సాయి రాజు బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలతో కేక్ కట్ చేయించి వారందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రిన్సిపాల్ జే సునీత మాట్లాడుతూ భవిత సెంటర్‌లో సేవలను వినియోగించుకునేందుకు 99859 51397 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ జె.యువరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొట్టారా.. సాక్షులను చూపించు..!

బాధితుడిపై భవానీపురం పోలీసుల వితండవాదం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొట్టారని చెబుతున్నావు సరే.. మరి సాక్షులను చూపించమంటూ భవానీపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక ఏఎస్ఐ బాధితుడిని విచారించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు లింగారెడ్డి అనే యువకుడు ఒక మీడియా సంస్థలో కెమేరామెన్‌గా పని చేస్తూ గొల్లపూడి మైలురాయి సెంటర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈ క్రమంలో అతను సోమవారం సాయంత్రం ఇంటి వద్ద నుంచి గొల్లపూడి బైపాస్ రోడ్ మీదుగా సితార జంక్షన్ వైపు వెళ్తుండగా అట్కిన్‌సన్ స్కూల్ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి వాహనాలను అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు వైపునకు మళ్లిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దాంతో బాధితుడు తన బైక్‌ను ఒక్క పక్కగా ఆపారు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి బాధితుడి బైక్‌ను నెట్టేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ చెంపపై కొట్టారు. ముగ్గురిలో మరో వ్యక్తి వచ్చి నువ్వు ఈ ఏరియాలో తిరిగితే చంపేస్తాం అంటూ బెదిరించాడు. బైక్ నడిపే వ్యక్తి వెళ్లిపోవడంతో భయపడ్డ బాధితుడు వెంటనే భవానీపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. ఆయన బీటు కానిస్టేబుల్‌ను పంపించారు. వారు వచ్చి ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వారు వన్‌టౌన్ పంజా సెంటర్‌కు చెందిన వ్యక్తులని తెలిసింది. అనంతరం బాధితుడు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వగా ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినియోగదారునిగా మనకు ఉన్న హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (డీఎస్ఎంసీ) ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యాధరపురంలోని డీఎస్ఎంసీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్ బంక్, వంట గ్యాస్, బ్యాంక్ తదితర సంస్థల ద్వారా సేవలు పొందే హక్కు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుడు జే భానుప్రకాష్ మాట్లాడుతూ.. మనం వస్తువులు కొనే ముందు తయారీ తేదీ, ఎప్పటి వరకు వాడవచ్చు తేదీల వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.విజయలక్ష్మి, ఎం.శారద తదితరులు పాల్గొన్నారు.

26న అయ్యప్ప మండల పూజ ముగింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో మండల పూజ ముగింపు కార్యక్రమాలను ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం తెలిపారు. నవంబర్ 16 నుంచి ఈ నెల 26వ తేదీ వరకు మండల పూజ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ముగింపు కార్యక్రయాల్లో భాగంగా 26న తెల్లవారుజామున గణపతి హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం స్వామి వారికి అభిషేకం, ఉష పూజ, కలశ పూజ, తదుపరి తులసి లక్షర్చన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వాములకు, భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు కొత్తపేట శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి నుంచి గరుడ సేవ మేళతాళాలతో శ్రీ అయ్యప్ప స్వామి దీక్షాపరులచే 108 జ్యోతులతో శ్రీ స్వామి వారిని గుర్రం వాహనం మీద ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అలాగే పెటతుల్లై అను ఆటవిక నృత్యంతో, వివిధ రకాల వేషధారణలతో ఊరేగింపు కార్యక్రమం ఆలయానికి చేరుకుంటుందన్నారు. రాత్రి హోం గుండంలో భక్తులు నడుస్తారన్నారు. వైదిక కార్యక్రమాలను బ్రహ్మశ్రీ కె.మురళీధరన్ నంబూద్రి అధ్యర్యంలో జరుగుతాయని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రజలకు భారమైన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా పశ్చిమ నగర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గాదే ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. 50వ డివిజన్, గొల్లపాలెంగట్టు రోడ్డులో విద్యుత్ చార్జీలపై జరిగిన నిరసన ప్రదర్శనలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు ఇ.వి నారాయణ, సీపీఎం నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంలో పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు గణితంలో పట్టు సాధిస్తే, మిగిలిన అన్ని రంగాల్లోనూ అద్భుతమైన విజయాలను సొంతం చేసుకోవచ్చని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో గణిత దిన వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం జరిగింది. విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్, పవర్‌పాయింట్ ప్రజంటేషన్, ఇన్నోవేటివ్ గేమ్స్, క్విజ్ తదితర అంశాల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ ఏ పతంజలిశాస్త్రి, కె.సురేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.





ఇరుముడులు సమర్పిస్తున్న భవానీలు

జై భవానీ.. జైజై భవానీ

భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భవానీలు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పద్మావతి ఘాట్, సీతమ్మ వారి పాదాలు, భవానీ, పున్నమి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భవానీలు గిరి ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులు సమర్పించారు. జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అమ్మవారి ఆలయంలో భవాని



కుమారుడితో అమ్మ సన్నిధిలో..

హెల్మెట్‌తో ప్రాణానికి భద్రత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, హెల్మెట్‌తో ప్రాణానికి సైతం రక్షణ ఉంటుందని వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ అన్నారు. కెనాల్‌రోడ్డు, ప్రకాశం బ్యారేజీ, మోడల్ గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న వాహన చోదకులను ఆపి, వారికి జరిమానాలను విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. ఏడీసీపీ రామకృష్ణ మాట్లాడుతూ.. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి ప్రాణాలను బలి పెట్టవద్దన్నారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంజా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించే క్రమంలో ఈ నెల 26 నుంచి జనవరి 30వతేదీ వరకు జరుగుతున్న సంజా ఉత్సవ్‌లో నగర వాసులందరూ పాల్గొనాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో సంజా ఉత్సవ్ మేళా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సంజా ఉత్సవ్ మేళాలో స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను పటమటలోని మేరీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో విక్రయిస్తారన్నారు. మేళాలో 100కు పైగా చేనేత, స్వదేశీ ఉత్పత్తుల స్టాల్ ఉంటాయని, కేవలం ప్రదర్శన, అమ్మకాలు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, కిడ్స్ ప్లే, ఫుడ్ కోర్ట్ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందని చెప్పారు. వీఎంసీ యూసీడీ పీవో వెంకట నారాయణ, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఫణి కుమార్, సుజాత, రవిశంకర్, సీఓ శ్రీనివాస్, ఎంఐఎస్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

అమ్మవారి భక్తుల సౌకర్యానికి ప్రత్యేక చర్యలు

పటమట(విజయవాడతూర్పు): భవానీ దీక్షల విరమణకు వచ్చే అమ్మవారి భక్తుల సౌకర్యానికి ఎటువంటి లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన ఆయా విభాగాల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవానీ దీక్షల విరమణ సందర్భంగా భక్తులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య ఉత్పన్నమవ్వకూడదని, ఇప్పటి వరకు 6.5 లక్షల బాటిళ్లను 6.3 లక్షల వాటర్ ప్యాకెట్లను అందించామన్నారు. గిరి ప్రదక్షిణ ప్రాంతంలో, ఘాట్లలో 42 వాహనాలతో, 1,400 మంది పారిశుద్ధ్య కార్మికులతో నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతుందని చెప్పారు. నిత్యం 100 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగిస్తున్నారన్నారు. భవానీ దీక్ష విరమణ అనంతరం భక్తులు వదిలేసే వస్త్ర వ్యర్థాలను ఇప్పటి వరకు 40 టన్నులు తొలగించారని పేర్కొన్నారు. ఆరు ప్రదేశాలలో ఉచిత చెప్పులు, సామాన్లు భద్రపరచుకోటానికి క్లోక్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 15 ప్రాంతాల్లో 200 మొబైల్ టాయిలెట్ల ద్వారా భవానీలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తున్నారని, తాగునీటి సరఫరాను ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతి గంటకి నివేదికను సేకరిస్తూ స్టాక్‌లను నింపుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.

బాక్సింగ్‌లో రౌడీ షీటర్ల చొరబాటు నిలువరించండి

విజయవాడస్పోర్ట్స్: బాక్సింగ్ క్రీడల్లో రౌడీ షీటర్ల చొరబాటును నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తంను ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి వై.ఉమామహేష్ కోరారు. ఈ విషయంపై ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం నుంచి ఏపీ ఒలంపిక్ సంఘానికి ఉమామహేష్ చేసిన ఫిర్యాదు పత్రాన్ని మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. ఈ నెల 19, 20వ తేదీలలో పిఠాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాక్సింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన రౌడీషీటర్ రత్న హేమంత్ కుమార్ అలియాస్ పిచ్చికుమార్ (33) 90 కేజీల బరువు కేటగిరిలో ఆడేందుకు రాష్ట్ర సెక్రటరీ లక్ష్మణ్‌దేవ్ అనుమతించడాన్ని లేఖలో తప్పుపట్టారు. హేమంత్ కుమార్‌పై శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస, ఎచ్చెర్ల, బొబ్బిలి, శ్రీకాకుళం– 2 టౌన్ పోలీస్ స్టేషన్లలో 11 కేసులు ఉన్నాయని, శ్రీకాకుళం– 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో హేమంత్ కుమార్‌పై రౌడీషీట్ ఉందని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పేకాట, గాంబ్లింగ్, కొట్లాట, బెదిరింపులకు పాల్పడుతూ రౌడీ షీటర్‌గా పేరు తెచ్చుకున్నాడని ప్రస్తావించారు. రౌడీ షీటర్లను, పోలీస్ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను క్రీడా పోటీల్లోకి రానివ్వకూడదనే నిబంధనను తుంగలో తొక్కుతూ రాష్ట్రంలో బాక్సింగ్ క్రీడకు కళంకం తీసుకొచ్చారని పేర్కొన్నారు. సదరు రౌడీ షీటర్‌కు బాక్సింగ్ క్రీడలో నైపుణ్యం లేకపోయినా విజేతగా ప్రకటించారన్నారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారుడు వినయ్‌కు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

భవానీ దీక్షాపరులకు పండ్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని మిథిలానగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు కేవీఎస్ ఆధ్వర్యంలో సితార జంక్షన్‌లో గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీ దీక్షాపరులకు మంగళవారం రాత్రి పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. సొసైటీ మహిళా విభాగం అధ్యక్షురాలు పిళ్లా అన్నపూర్ణ మాట్లాడుతూ.. గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీ మాలాధారులు, అమ్మవారి భక్తులకు గత పదేళ్ల నుంచి ఈ వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గడిచిన నాలుగు రోజులుగా దాదాపు పది వేల మందికిపైగా భవానీలకు పండ్లు, అల్పాహారం అందించామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.